సాక్షి
అనకాపల్లి
సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



అమ్మ దర్శనానికి.. 8లో

నెల పండగ ముందు ఆఖరు ఆదివారం కావడంతో అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



వెండితెర ప్రయాణంలో.. 8లో

వర్ధమాన దర్శకుడు గోపీకృష్ణ సినీ రంగంలో రాణిస్తున్నారు. ఆయన తీసిన కలియుగ భగవాన్ చిత్రం 21న విడుదల కానుంది.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర జగన్నాథుడి విగ్రహాలకు పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
అనకాపల్లి	6-17	4-23
నర్సీపట్నం	6-20	4-22

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల నిరీక్షణ

నర్సీపట్నం: బీసీ గురుకులాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించినట్టు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎన్.వెంకటరెడ్డి తెలిపారు. జిల్లాలోని నర్సీపట్నం, అనకాపల్లి, తానాం, చోడవరంలో 800 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 47 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. నర్సీపట్నం సెంటర్లో 186 మంది విద్యార్థులకుగాను 169 మంది హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చదువుతోపాటు ఆటలూ ముఖ్యమే!

- సేవ్ నేషన్.. సేవ్ యూత్ పేరిట క్రీడాకారుడి పరుగుయాత్ర



రూపేష్ మక్వానాతో కలిసి పరుగుయాత్రలో పాల్గొన్న భారత స్వాభిమాన్ ట్రస్టు సభ్యులు

అనకాపల్లి టౌన్: యువత చదువుతోపాటు క్రీడల పట్ల దృష్టి సారించాలని గుజరాత్‌కు చెందిన క్రీడాకారుడు రూపేష్ మక్వానా అన్నారు. సేవ్ నేషన్.. సేవ్ యూత్ నినాదంతో 95 రోజుల క్రితం ఢిల్లీలో పరుగుయాత్ర ప్రారంభించిన రూపేష్ మక్వానా ఆదివారం మండలంలో కొత్తూరు కూడలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్లు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పరుగుయాత్రలో ప్రపంచ రికార్డు వచ్చిందని, ఆ రికార్డును బ్రేక్ చేస్తూ అందరిలోనూ స్ఫూర్తి నింపుతూ మరింత ఉత్తమమైన రికార్డును అందించేందుకు మరికొంతమంది యువత ముందుకురావాలన్నారు. ఈ యాత్ర మహారాష్ట్ర, చెన్నై, ఆంధ్రప్రదేశ్, కోల్‌కత్తా మీదుగా తిరిగి ఢిల్లీ చేరుకుంటుందని పేర్కొన్నారు. రోజుకు 70 కిలోమీటర్ల పరుగుయాత్ర ద్వారా ప్రస్తుతానికి 6 వేల కిలోమీటర్లు సాగిందన్నారు. పట్టణానికి చేరుకున్న రూపేష్ మక్వానాను భారత స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగా జిల్లా అధ్యక్షుడు టీఎస్‌వీ ప్రసాదరావు, యోగా సభ్యులు దొరమనాయుడు, పూర్వపు అధ్యక్షులు సాయి, నాగేశ్వరరావు, ప్రభాకర్, నాగేశ్వరరావులు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

తిమ్మాపురంలో వెంకీ సందడి



వెంకటేష్‌తో ఫొటోలు తీసుకుంటున్న అభిమానులు

విశాఖ: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో ఆదివారం సాయంత్రం హీరో విక్టరీ వెంకటేష్ సందడి చేశారు. ఉక్కు నగరంలో జరుగుతున్న సైంధవ్ సినిమా షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు. ఆదివారం తన రామానాయుడు స్టూడియోకు చేరుకుని కాసేపు గడిపారు. పర్యాటకులు వెంకటేష్‌ను చూసి ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

నేడు జీవీఎంసీ స్పందన

విశాఖ: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

కరోనాపై అప్రమత్తం

కరోనా రక్కసి మళ్లీ కోరలు చాస్తోంది. కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా కోవిడ్ కేసుల విజృంభణతో జిల్లా వైద్యశాఖ కూడా అప్రమత్తమైంది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ముందస్తుగా కరోనా చికిత్సకు ప్రత్యేక పడకలు సిద్ధం చేసింది. విలేజ్ క్లినిక్‌లతోపాటు అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో కరోనా నిర్ధారణ పరీక్షలు పెంచారు. ప్రజల్ని కూడా అప్రమత్తం చేస్తున్నారు.



అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో కరోనా సన్నద్ధతపై మాక్‌డ్రిల్ (ఫైల్)



ఆక్సిజన్ పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్

- జిల్లా యంత్రాంగం ముందస్తు సన్నాహాలు
- కొత్త వేరియంట్ వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు
- జిల్లాలోని ఆస్పత్రుల్లో అందుబాటులో 800 బెడ్స్
- పుష్కలంగా ఆక్సిజన్, మందులు
- అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కోవిడ్ పరీక్షలు

సాక్షి, అనకాపల్లి: కోవిడ్ కేసులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఇప్పటికే అధికారులతో సమీక్షలు నిర్వహించారు. కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కరోనా కేసుల నియంత్రణకు ముందస్తు చర్యలకు దిగారు. ఈ మేరకు ఆస్పత్రుల్లో సిబ్బందితోసహా ప్రతి ఒక్కరూ మాస్క్ తప్పనిసరిగా ధరించాలని వైద్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. కేసుల సంఖ్య పెరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా వైద్యశాఖ ప్రకటించింది.

కోవిడ్ రోగులకు 800 బెడ్స్

కరోనా కొత్త వేరియంట్ విజృంభిస్తోన్న నేపథ్యంలో జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 800 బెడ్స్‌ను సిద్ధం చేశారు. వీటిలో ఆక్సిజన్ బెడ్లు సుమారు 200, ఐసీయూ బెడ్లు 20, వెంటిలేటర్ బెడ్లు 30, సాధారణ పడకలు 550 వరకు ఉన్నాయి. జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీలు) ఒక్కో ఆస్పత్రిలో 10 బెడ్ల చొప్పున 450 బెడ్లు కోవిడ్ రోగుల కోసం ప్రత్యేకంగా సిద్ధం చేశారు. 6 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీలు) 25 నుంచి 26 చొప్పున 156 పడకలు ఏర్పాటు చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో 99, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 85 పడకలు సిద్ధం చేశారు. రోగుల సంఖ్య మరీ ఎక్కువైతే అప్పటికప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు వీలుగా ఆస్పత్రి యాజమాన్యాలను సన్నద్ధం చేశారు.

రెండు రోజులు మాక్‌డ్రిల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ నెల 10, 11 తేదీల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్‌డ్రిల్ కోసం ఆరుగురు ప్రోగ్రాం అధికారుల్ని నియమించారు. ఒక్కో పీవో పరిధిలో 6 నుంచి 8 ఆస్పత్రుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. వీరు జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్స్, వెంటిలేటర్స్, ఐసీయూ బెడ్స్‌ను ముందుగానే పరిశీలించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు కోవిడ్ వైద్యానికి సిద్ధంగా ఉన్నాయా? లేదా? పడకలు, ఆక్సిజన్, మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, వైద్య బృందం ఏ మేరకు అందుబాటులో ఉన్నాయో.. పరిశీలించారు. సన్నద్ధతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రాణాంతకం కాదు.. కానీ?



ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరోనా నిర్ధారణ పరీక్షలు పెంచాం. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో గ్రామాల్లో అనుమానిత లక్షణాలుంటే గుర్తిస్తున్నాం. ప్రస్తుతం కేసుల సంఖ్యపై ఆందోళన అవసరం లేదు. అనుమానిత లక్షణాలుంటే ఐసోలేషన్, మాస్క్, శానిటైజేషన్ వంటి జాగ్రత్తలు తప్పనిసరి. కోవిడ్ రోగుల్లో స్వల్ప లక్షణాలే ఉంటున్నాయి. ప్రాణాంతక పరిస్థితులు చాలా తక్కువ. ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం లేకుండానే చాలా మందిలో తగ్గిపోతోంది. ప్రతీ ఒక్కరూ కోవిడ్ ప్రవర్తనా నియమావళి పాటించాల్సిందే.

– డాక్టర్ హేమంత్, డీఎంహెచ్‌వో

చందనోత్సవానికి శ్రీకారం

- తొలివిడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి తొలి విడత చందనం అరగదీత కార్యక్రమం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ నెల 23న వైశాఖ శుద్ధ తదియ రోజు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం(నిజరూప దర్శనం) జరగనుంది. ఆ రోజు రాత్రి స్వామికి తొలి విడతగా సమర్పించాల్సిన మూడు మణుగుల (120 కిలోలు) పచ్చి చందనం సమకూర్చేందుకు ఈ అరగదీత కార్యక్రమాన్ని చేపట్టారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఉదయం 6.05 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకులు నిర్వహించారు. తొలుత బేడా మండపంలోని భాండాగారం వద్ద తొలి చందనం చెక్కను ఉంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడసోపచార పూజలు నిర్వహించారు. అనంతరం ఆ చందనం చెక్కతో ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య బేడా ప్రదక్షిణ చేశారు. అనంతరం నోటికి గంతలు కట్టుకుని శ్రీనివాసాచార్యులు తొలి చందనాన్ని అరగదీశారు. ఆలయ ప్రధానార్చకుడు–2 ఇరగవరపు రమణాచార్యులు, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు చందనాన్ని అరగదీశారు. అరగదీసిన చందనాన్ని స్వామి మూల విరాట్‌కి సమర్పించారు. అనంతరం 15 మంది నాలుగో తరగతి సిబ్బంది చందనం అరగదీతను ప్రారంభించారు. అర్చకులు గిరి, పెద్దరాజు, కుమార్ పూజలు నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, వంకాయల సాయినిర్మల, ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్, డిప్యూటీ ఈవో సుజాత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాగా ప్రధానార్చకుడి హోదాలో తొలిసారి తొలి చందనాన్ని అరగదీసే అవకాశం గొడవర్తి శ్రీనివాసాచార్యులకు దక్కింది. గడిచిన కొన్నేళ్లుగా తొలి చందనాన్ని ఆలయ ప్రధానార్చకులే తీస్తున్నారు. గతంలో ఇన్‌చార్జి ప్రధానార్చకుడిగా రెండుసార్లు తొలి చందనం అరగదీసిన శ్రీనివాసాచార్యులు ఈ సారి ప్రధానార్చకుడి హోదాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

79 ఏళ్ల రావిప్రోలుకు ఏయూ డాక్టరేట్



రావిప్రోలు సుబ్రహ్మణ్యం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం పరిశోధక విద్యార్థి రావిప్రోలు సుబ్రహ్మణ్యంకు డాక్టరేట్ లభించింది. 'ఏయూ విద్యార్థుల్లో మహాత్మా గాంధీపై అవగాహన' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి శనివారం డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు. గాంధీజీపై ఉన్న ఆసక్తితో 79 ఏళ్ల వయసులో సుబ్రహ్మణ్యం ఎంతో శ్రద్ధతో డాక్టరేట్ పూర్తి చేయడం విశేషం. మహాత్ముడిపై వెయ్యికిపైగా పుస్తకాలను సేకరించారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్‌లో చీఫ్ కెమిస్ట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన అనంతరం రావిప్రోలు ఎంఏ గాంధీయన్ స్టడీస్ కోర్సును మధురై కామరాజ్ యూనివర్సిటీలో పూర్తి చేశారు.

ఏటికొప్పాక బొమ్మలకు అంతర్జాతీయ ఖ్యాతి



- విపో ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఈనెల 23 వరకు అవకాశం
- పదెకరాల్లో రూ.50 లక్షలతో ఇండస్ట్రీ ఏర్పాటు : ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: ఏటికొప్పాక లక్కబొమ్మలకు రంగులు దిద్దేందుకు అదే గ్రామంలో పదెకరాల స్థలంలో రూ.50 లక్షలతో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీని ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీ డాక్టర్ సత్యవతి చెప్పారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచస్థాయిలో ఈ బొమ్మలకు గుర్తింపు తీసుకొచ్చేందుకు ఈనెల 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ (విపో)లో జరిగే ఆన్‌లైన్ ఓటింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఇందులో ప్రపంచవ్యాప్తంగా 10 లక్కబొమ్మలకు ఓటింగ్ జరుగుతోందని, పదింట్లో ఏటికొప్పాకకు చెందిన ఐదు లక్కబొమ్మలకు ప్రాధాన్యం లభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ బొమ్మలపై 90 సెకన్ల వీడియో తయారు చేసినట్లు చెప్పారు. ఏటికొప్పాక బొమ్మల ప్రాధాన్యతను పార్లమెంట్‌లో ప్రస్తావించినట్లు చెప్పారు. ఒకే జిల్లా, ఒకే ప్రాజెక్టు కింద అనకాపల్లి జిల్లాలో లక్కబొమ్మలను ఎంపిక చేసినట్లు చెప్పారు. యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు సహకారంతో ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన కేంద్రానికి నివేదిక సమర్పించామన్నారు. అనకాపల్లి బెల్లానికి ప్రభుత్వ జియో ట్యాగింగ్ కోసం చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన 'ఆశువుగా హాస్యం'



ఆశువుగా జోకులు చెబుతున్న కామెడీ జోడి వేముల భాస్కరాచారి, పెసల కనకదుర్గాప్రసాద్

సీతంపేట : ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో జోకులు చెప్పి సుతిమెత్తని హాస్యంతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. క్రియేటివ్ కామెడీ క్లబ్, హాస్యప్రియా కామెడీ క్లబ్ సంయుక్త నిర్వహణలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధనకు 12 గంటల నిర్విరామ 'ఆశువుగా హాస్యం' కార్యక్రమం నిర్వహించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కామెడీ జోడి వేముల భాస్కరాచారి, పెసల కనకదుర్గాప్రసాద్ ప్రేక్షకులు అడిగిన 120కి పైగా విభిన్న అంశాలపై ఆశువుగా అప్పటికప్పుడు జోకులు చెప్పి అందరినీ కడుపుబ్బా నవ్వించారు. సభా మర్యాదలు, ఉపన్యాసాలు, దేవుడు ఆధ్యాత్మికత, స్నేహితులు, పుస్తకాలు, అలవాట్లు, కుటుంబ వ్యవహారాలు, ఊబకాయం, టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, వంటా వార్పు, భోజనాలు, రియల్ ఎస్టేట్, భార్యాభర్తలు వంటి పలు అంశాలపై హాస్యం పండించారు. ఆదివారం ఉదయం 6.50 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం 6.50 గంటల వరకు జరిగింది. హాస్యప్రియులను ఈ కార్యక్రమం అలరించింది.

ప్రకృతి సాగు.. ఆదరణ బాగు



ప్రకృతి వ్యవసాయం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు



ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను తెలిపే ముగ్గును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

- తక్కువ ఖర్చుతో ఆరోగ్యకర పంటల దిగుబడి
- ఆర్గానిక్ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలో ఆదివారం రైతులకు నవధాన్యాల సాగు, అంతర పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ఖరీఫ్ ప్రణాళిక ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలు, కరపత్రాలను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలను అందజేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రకృతి సాగు పద్ధతుల్లో జీవామృతం, బీజామృతం వంటి వాటిని ఉపయోగించి, ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు పాటించి మెరుగైన వ్యవసాయ దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటల దిగుబడిని పొందవచ్చునన్నారు. మార్కెట్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటల ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, ఈ నేపథ్యంలోనే రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం లచ్చన్న మాట్లాడుతూ జిల్లాలో 164 గ్రామాల్లో 38,550మంది రైతులు 45,083 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. వీరికి 7925 స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సమావేశం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక సర్పంచ్ గొంప వరహాలమ్మ, ఏపీసీఎన్ఎఫ్ రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్, అడిషనల్ డీపీఎం గోవింద్, మాస్టర్ ట్రైనర్ నాగమణి, మర్రినాయుడు, నాలుగు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌తో భవిత



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

- రండి.. డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ పొందుదాం
- ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఏయూ ఆహ్వానం
- శిక్షణ, నిర్వహణ, తయారీపై వర్సిటీలో కేంద్రం



డ్రోన్లపై పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు



పరిశోధనలకు అందుబాటులో వివిధ రకాల డ్రోన్లు

సాక్షి, విశాఖపట్నం: ప్రస్తుత రోజుల్లో సందడంతా డ్రోన్లదే. వ్యవసాయం, పెళ్లిళ్లు, భూముల సర్వే, మందుల పంపిణీ, సినిమా షూటింగ్‌లు, యూట్యూబ్ వీడియోలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏరియల్ సర్వే.. ఇలా పలు సందర్భాల్లో డ్రోన్ల వినియోగం గణనీయంగా పెరిగింది. సాంకేతికతో సాయంతో వీటికి దిశానిర్దేశం చేస్తే.. లక్ష్యాన్ని అందుకుంటాయి. అయితే వీటిని నడిపే మానవ వనరుల కొరత ఉంది. నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవడం, ఖర్చును తగ్గించుకునే విషయంలో ఇప్పుడు అందరి ఆలోచన డ్రోన్ టెక్నాలజీ.. ప్రస్తుతం డ్రోన్ల సేవలు విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థులను డ్రోన్ టెక్నాలజీలో సుశిక్షితులను చేసేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం సన్నద్ధమైంది. ఇందులో పరిశోధనల కోసం డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం 2022లో డ్రోన్ అంకుర సంస్థల వృద్ధి 34.4 శాతంగా నమోదైంది. డ్రోన్ టెక్నాలజీ సంస్థల్లో పెట్టుబడులూ వెల్లువెత్తుతున్నాయి. డ్రోన్ సేవల మార్కెట్ విలువ దేశీయంగా రెండేళ్ల కిందట 13.04 కోట్ల డాలర్లుగా నమోదైంది. 2030 నాటికి ఇది 400 కోట్ల డాలర్లకు పురోగమిస్తుందని నిపుణులు అంచనా. వివిధ రంగాలకు అవసరమైన డ్రోన్లు, వాటి విడిభాగాలను తయారు చేసుకోవడంలో భారత్.. ఇంకా స్వయం సమృద్ధి సాధించలేదు. సరైన ప్రణాళికలు, ప్రోత్సాహం అందిస్తే స్టార్టప్ సంస్థల సహకారంతో దేశంలో తయారీ సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా సరికొత్తగా ఇన్నోవేషన్ సెంటర్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీస్(ఐసీడీటీ) కేంద్రాన్ని ఏయూ ఏర్పాటు చేసింది.

యూనివర్సిటీల చరిత్రలో తొలిసారిగా..

డ్రోన్ టెక్నాలజీ పరిశోధనలపై ఈ తరహా కేంద్రాన్ని ఇంత వరకూ ఏ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయలేదు. మొదటిసారిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏయూ ప్రాంగణంలోని హెలిప్యాడ్ గ్రౌండ్స్‌ను ఆనుకొని దీన్ని ప్రారంభించారు. డ్రోన్లకు సంబంధించిన పైలట్, అప్‌స్కిల్లింగ్, ట్రైనింగ్, అసెంబుల్, నూతన సాంకేతికత మొదలైన అన్ని అంశాల్లోనూ ఇక్కడ పరిశోధనలు జరగనున్నాయి. డ్రోన్ల నిర్వహణ, తయారీ అంశాలపై పరిశోధనలు చేసే కేంద్రంగా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఏయూలో ఏ కోర్సు చదివే విద్యార్థులైనా ఇక్కడ అందించే కోర్సుల్లో చేరి తమ నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం కల్పిస్తోంది. విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడానికి హెలిప్యాడ్ మైదానాన్ని వినియోగించనున్నారు. ఈ సెంటర్‌లో డ్రోన్ వినియోగం, డ్రోన్ టెక్నాలజీపై భవిష్యత్ పరిశోధనలు నిర్వహించేలా మరింత అభివృద్ధి చేసేందుకు ఏయూ ప్రణాళికలు సిద్ధం చేసింది.

సర్టిఫికెట్ ప్రోగ్రాంగా అందిస్తున్నాం

దేశాన్ని డ్రోన్ల కేంద్రంగా మార్చాలని కేంద్రం, వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగం విస్తృతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి. అయితే వేగంగా విస్తరిస్తున్న భారతీయ డ్రోన్ పరిశ్రమకు నిపుణులైన మానవ వనరుల కొరత వేధిస్తోంది. దీన్ని అధిగమించేలా తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏయూలో ప్రారంభించాం. ఐసీడీటీను పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రోగ్రాం కూడా అందిస్తున్నాం. ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఏయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులు కూడా ఈ శిక్షణలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నాం.

– ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, వీసీ, ఏయూ

క్లుప్తంగా

హరిపాలెం టీచర్‌కు పూలే అవార్డు



పూలే అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు అప్పారావు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలం హరిపాలెంకు చెందిన ఉపాధ్యాయుడు మారిసెట్టి అప్పారావు ఆదివారం జ్యోతిరావుపూలే అవార్డును అందుకున్నారు. తిరుపతిలోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్ర కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డుని అందుకున్నారు. విద్య, సామాజికాంశాల్లో విశేష సేవలందించిన వారికి పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డులను అందిస్తుంటారు. తిరుపతి డీఈవో వి.శేఖర్, సీనియర్ జర్నలిస్ట్ ఇంద్రవెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొట్లాటలో ఇరు వర్గాలపై కేసు

చోడవరం రూరల్ : మండలంలోని జన్నవరం గ్రామంలో పెద్దలు పంచాయతీ జరుపుతుండగా కొట్లాటకు దిగిన సంఘటనలో ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. వివరాలు.. జన్నవరం గ్రామానికి చెందిన సాలాపు శ్రీను నాటుసారా విక్రయాలు సాగిస్తున్న సమాచారాన్ని అదే గ్రామానికి చెందిన సాలాపు నరసింహమూర్తి ఎక్సైజ్ అధికారులకు అందించి, శ్రీను పట్టుబడేలా చేశాడన్నది వారి కుటుంబీకుల అనుమానం. ఈ విషయమై నరసింహమూర్తిని నానా తిట్లు తిడుతున్నారని అతని ఆరోపణ. ఈ వ్యవహారంలో ఇరువర్గాలను ఆదివారం గ్రామకూడలిలో సమావేశపరచి గ్రామపెద్దలు వారి మధ్య సయోధ్యకు ప్రయతిస్తే మాటామాటా పెరిగి, ఇరు వర్గాల బంధువులు జోక్యం చేసుకోవడంతో రెండు వర్గాలు ఘర్షణ పడి ఒకరినొకరు చేతులతో కొట్టుకున్నారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి, ఎస్‌ఐ అప్పలనాయుడు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వెండితెర ప్రయాణంలో మునగపాక కుర్రోడు



డాక్టర్ కోరుకొండ గోపీకృష్ణ, వర్ధమాన దర్శకుడు

- లఘు చిత్రాలతో మొదలైన సినీ ప్రయాణం
- నిన్న ఓటీటీ సినిమా.. నేడు థియేటర్ సినిమా
- ఈ నెల 21న కలియుగ భగవాన్ చిత్రం విడుదల
- వర్ధమాన దర్శకుడు కోరుకొండ గోపీకృష్ణ



కలియుగ భగవాన్ షూటింగ్ పర్యవేక్షిస్తున్న దర్శకుడు గోపీకృష్ణ

మునగపాక : కళారంగానికి పెట్టింది పేరు మునగపాక. ఎంతోమంది కళాకారులను తయారు చేసిన మునగపాక గడ్డ నేడు మరో చరిత్రకు శ్రీకారం చుట్టనుంది. ఈ నెల 21న వర్ధమాన దర్శకుడు కోరుకొండ గోపీకృష్ణ రూపొందించిన కలియుగ భగవాన్ చిత్రం విడుదల కానుంది.

పరిమిత వనరులతో..

మునగపాక గ్రామీణ ప్రాంతానికి గోపీకృష్ణ గతంలో రూపొందించిన వాడే–వీడు చిత్ర ఓటీటీలో విడుదలపై మిలియన్‌కు పైగా వ్యూస్ సాధించింది. ఇపుడు నేరుగా థియేటర్లలోనే తన కొత్త సినిమా కలియుగ భగవాన్ రిలీజ్ కానుండటంతో మునగపాక పరిసర గ్రామాలతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా సినీ అభిమానులు ఎదురుచూస్తున్నారు. సినిమా రంగంపై ఉన్న ఆసక్తితో తనకున్న పరిమిత వనరులను ఉపయోగించుకుని పలు లఘు చిత్రాలతో సత్తాచాటాడు. జీరో బడ్జెట్ చిత్రాల నుంచి ఇపుడు చిన్న బడ్జెట్ సినిమాతో సినీ అభిమానుల్ని అలరించేందుకు ముందుకొస్తున్నాడు.

యదార్థ సంఘటనలతో..

మునగపాక గ్రామానికి చెందిన డాక్టర్ కోరుకొండ గోపీకృష్ణ చిన్నప్పటి నుంచి కళలపై ఆసక్తి చూపేవారు. సాహిత్యంపై మక్కువతో పలు కవితలు, రచనలు చేశారు. అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి అభినందనలు అందుకున్నారు. ఇపుడు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, మానవీయ విలువలు ప్రతిబింబించేలా కలియుగ భగవాన్ చిత్రాన్ని రూపొందించినట్టు గోపీకృష్ణ తెలిపారు. బాపూ రమణల స్ఫూర్తితో ధనం ఉంటే ధనవంతుడు అంటారు. అదే దానం చేస్తే భగవంతుడు అంటారు అనే కథాంశంతో రూపుదిద్దుకున్న కుటుంబ కథా చిత్రమని పేర్కొన్నారు. భగవంతుడిని నమ్మే ప్రతి ఒక్కరి కోసం రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్టు తెలిపారు.

నిన్న ఓటీటీలో వాడే–వీడు.. నేడు థియేటర్లలో కలియుగ భగవాన్

వేదన, ఓ మనసు కథ, మత్తు వదలరా.. వంటి లఘు చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకుడు గోపీకృష్ణ స్వీయ దర్శకత్వంలో రూపొందిన వాడే–వీడు ఓటీటీ ద్వారా విడుదల చేసిన విషయం తెలిసిందే. 11 లక్షలకు పైగా ఓటీటీ ద్వారా వీక్షించారంటే గోపీకృష్ణ ప్రతిభ తెలుస్తోంది. తాజాగా మరో అడుగు ముందుకేసి స్థానిక కళాకారులతో తీసిన కలియుగ భగవాన్ ఈ నెల 21న రాష్ట్రంలోని పలు థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధంగా ఉంది.

తెరవెనుక హీరోలు..

కలియుగ భగవాన్ చిత్రం వెనుక ఎంతోమంది కళాకారుల కష్టం కనిపించనుంది. అల్లు ప్రొడక్షన్ బ్యానర్‌పై అల్లు శ్రీరాములనాయుడు నిర్మించిన ఈ చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం కోరుకొండ గోపి అందించారు. ఇ.బ్రహ్మానందరెడ్డి, సత్య ప్రకాష్, సామ్‌దీరా, పావని, పెంటారావుతో పాటు మునగపాక పరిసర ప్రాంతాలకు చెందిన కళాకారులు సినిమాలో నటించారు. సంగీతం ఎంఎల్ రాజా అందించగా, పాటలు డాక్టర్ తిరునగరి శరత్ చంద్ర, డాక్టర్ గోపీకృష్ణ రచించారు. మాటలు డాక్టర్ గోపీకృష్ణతో పాటు మునగపాకకు చెందిన యువ రచయిత విల్లూరి జగ్గప్పారావు అందించారు. మేడిది ఈశ్వరరావు, ముక్కి రాంబాబులు కో–ప్రొడ్యూసర్లుగా, డి.నరేష్ కో–డైరెక్టర్‌గా, శ్యామ్‌కుమార్, సంతోష్‌లు ఎడిటింగ్ చేపట్టారు. కిరణ్ వారియర్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు.

డిప్యూటీ సీఎంతో డీఎస్సీ 1998 టీచర్లు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న డీఎస్సీ-1998 ఉపాధ్యాయులు

దేవరాపల్లి : 1998 డీఎస్సీ కేటగిరీలో తాజాగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు ఆదివారం తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. సుదీర్ఘ కాలం తర్వాత తమకు ఉద్యోగాలిచ్చిన పుణ్యం సీఎం జగన్‌దేనని, తమ కుటుంబాలన్నీ జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాయని ఆనందం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌తోపాటు, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డిప్యూటీ సీఎం బూడి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం 1998 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థులందరికీ సీఎం జగన్ ఉద్యోగాలిచ్చారని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా విద్యకు సీఎం జగన్ ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులంతా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వరదపురెడ్డి రమేష్, ఆతవ మహేష్, డీఎస్సీ 1998 టీచర్లు వేచలపు అప్పలనాయుడు, ఆదిరెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టైర్ పేలి దూసుకెళ్లిన కారు

- మరో రెండు కార్లకు నష్టం



బయ్యవరం వద్ద జాతీయ రహదారిపై కార్లు ఢీకొనడంతో నిలిచిన వాహనాలు

కశింకోట : మండలంలోని బయ్యవరం రైల్వే వంతెన వద్ద జాతీయ రహదారిపై మూడు కార్లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. ప్రమాదంలో కార్లు నుజ్జయ్యాయి. పోలీసుల సమాచారం ప్రకారం.. అనకాపల్లి నుంచి యలమంచిలి వెళుతున్న కారు టైర్ పేలడంతో అదుపు తప్పి పక్క రోడ్డులోకి దూసుకెళ్లింది. అదే సమయంలో యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు అవతలి రోడ్డులో వరుసగా వస్తున్న రెండు కార్లను ఢీకొంది. దీంతో ఆ కార్లలో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులు గాయపడగా, వారిని 108 వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కార్లను క్రేన్‌తో పోలీసులు పక్కకు తొలగించారు. ప్రమాదం కారణంగా నిలిచిపోయిన వాహనాలను క్రమబద్ధీకరించారు. అయితే ప్రమాదంలో క్షతగాత్రుల వివరాలు ఇంకా తెలియరాలేదని ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

బీసీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ పెద్ద పీట

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రాష్ట్ర గాండ్ల, తెలికల కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబును అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం : బీసీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరానికి చెందిన దూతి సత్తిబాబును ఇటీవల రాష్ట్ర గాండ్ల తెలికల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంతో జిల్లా గాండ్ల, తెలికల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చోడవరంలో ఆదివారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్తిబాబును శాలువాలు, పూల దండలు వేసి అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ధర్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎంతో కృషిచేస్తున్నారని తెలిపారు. గతంలో బీసీలను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన టీడీపీ వారిని అన్ని విధాలుగా అణగదొక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక బీసీ కులాలకు కులాలవారీగా కార్పొరేషన్లు ఏర్పాటుచేసి, ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిందని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిత్రాడ అప్పారావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ జగస్, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, సంఘం కన్వీనర్ పి.రవికుమార్, కోశాధికారి సత్యనారాయణ, కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల్లో ఆస్తి నష్టం

- తుమ్మపాలలో రెండు పశువుల పాకలు, గడ్డిమేట్లు, ఫర్నిచర్
- యలమంచిలి రామారాయుడుపాలెంలో పాన్‌షాపు దగ్ధం



అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి రూరల్/యలమంచిలి : రెండు వేర్వేరు చోట్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు సంభవించాయి. ఈ సంఘటనల్లో రూ.లక్షల్లో ఆస్తి నష్టం సంభవించింది. అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామంలోని మెయిన్‌రోడ్డుకు ఆనుకుని బొజ్జన్న కొండకు వెళ్లే దారిలో 33కేవీ హై టెన్షన్ విద్యుత్‌వైరు నుంచి మంటలు సమీపంలోని మురాలశెట్టి శ్రీనివాసరావుకు చెందిన పశువుల పాకకు వ్యాపించడంతో అది పూర్తిగా దగ్ధమయింది.

ఫర్నిచర్, గృహోపకరణాలు, గడ్డిమేటు అగ్నికి ఆహుతి కావడంతో సుమారు రూ.2 లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. పక్కనే వున్న రైతు నూకప్పారావు పశువుల పాకతో పాటు, రీసా ఈశ్వరరావుకు చెందిన పీవీసీ పైపులు 2, వాటర్ ట్యాంకులు, ఒక ఏసీ కాలిబూడిదయ్యాయి. సమీపంలో మోదునాయుడు పశువులపాక, గడ్డిమేటు కూడా అగ్నికి ఆహుతయ్యాయి.

ప్రమాద సమాచారాన్ని స్థానికులు అనకాపల్లి అగ్నిమాపక కేంద్రానికి తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. నష్టపోయిన రైతులను విద్యుత్‌శాఖ అధికారులు ఆదుకోవాలని తుమ్మపాల సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు కోరారు. వారు అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీలా బుజ్జి, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాన్ షాపులో అగ్ని ప్రమాదం

యలమంచిలి మున్సిపాలిటీ రామారాయుడుపాలెం రైల్వే గేట్ వద్ద ఉన్న పాన్ షాపులో ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో పాన్‌షాపు యజమాని సూరిశెట్టి శ్రీను అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంతో రూ.30 వేలు విలువైన సరకు అగ్నికి ఆహుతయింది. మరో రూ.50 వేల సరకును సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు.

అమ్మ దర్శనానికి..



నూకాంబికను దర్శించుకుంటున్న భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం



ఆలయం వద్ద భక్తుల రద్దీ

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తింది. ఈనెల 19 నెల పండగ కావడం, మరోపక్క ఆఖరి ఆదివారం కావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనకాపల్లి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన విజయనగరం, విశాఖ, పాడేరు నుంచి అధికసంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి హాజరుకావడంతో ఆలయంలో ఉన్న క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువపందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి కుటుంబసమేతంగా భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అధికారులు భక్తులకు మజ్జిగ, మంచినీరు అందించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు పర్యవేక్షణలో ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఉత్సాహంగా పెద్దవేట ఉత్సవం

డప్పు, తుడుము కొట్టి ఉత్సాహపరిచిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఇటుక పండగలో భాగంగా మండలంలో సీకరి గ్రామంలో పెద్ద వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామ పోతురాజు, శంకుదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం పొలిమేర (వేటబయలు)లో వేట ఉత్సవం నిర్వహించారు. వేటకు ఉపయోగించే ఆయుధాలకు పూజలు చేశారు. వీటితో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే వేటకు వెళతారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎమ్మెల్యే పాల్గుణ

వేట ఉత్సవం సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గిరిజన సంప్రదాయ వాయిద్యాలైన తుడుము, డప్పును కొట్టి గ్రామస్తులను ఉత్సాహపరిచారు.

గ్రామస్తులతో కలిసి రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. సర్పంచ్ కృష్ణారావు, ఎంపీటీసీ ఆనందరావు, ,గ్రామ పెద్దలు స్వామి, వెంకటరమణ, మత్స్యవరప్రసాద్ పాల్గొన్నారు.

111 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి

- డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటరమణ



సిబ్బందికి సర్వేపై వివరిస్తున్న వెంకటరమణ

నాతవరం : రెవెన్యూ డివిజన్‌లో రెండవ విడత భూ రీసర్వే చేసిన 111 రెవెన్యూ గ్రామాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేస్తున్నట్టు నర్సీపట్నం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటరమణ తెలిపారు. మండలంలోని కేవీ శరభవరం, పొట్టినాగన్నదొరపాలెం గ్రామాల్లో ఆదివారం సరిహద్దు రాళ్ల ఏర్పాటుపై సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రీసర్వేపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. రీసర్వే పూర్తి చేసి సరిహద్దు రాళ్ల ఏర్పాటు పూర్తయితే, బ్రిటీష్ కాలం నుంచి వెంటాడుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కుతుందన్నారు. డివిజన్‌లో మొదట విడతలో 50కి పైగా రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తిచేసి సర్వే రాళ్ల ఏర్పాటు చేశామన్నారు. జిరాయితీ, ప్రభుత్వ భూములు, రోడ్లు, చెరువులకు సంబంధించి వేర్వేరుగా రాళ్ల ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రెండో విడతలో 60 రెవెన్యూ గ్రామాలకుపైగా సరిహద్దులో రాళ్లు పాతినట్టు వెల్లడించారు. మిగతా గ్రామాల్లో ఊడా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేందుకు ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్ ఆధ్వర్యంలో రోజుకు మూడు మండలాల చొప్పున క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, రైతులకు ఎలాంటి సందేహాలున్నా తమ దృష్టికి తీసుకొస్తే, క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.కనకారావు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సర్వేయర్లు విజయకుమార్, జగదీష్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగపూర్ నుంచి వచ్చిన వ్యక్తి భార్యకు నెగటివ్

చోడవరం రూరల్: సింగపూర్ నుంచి సెలవుపై వచ్చిన జన్నవరం గ్రామానికి చెందిన 33 ఏళ్ల వ్యక్తికి మాత్రమే కరోనా సోకిందని, అతని భార్యకు కరోనా లేదని గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.దమయంతీదేవి స్పష్టం చేశారు. గత ఆదివారం సింగపూర్ నుంచి స్వంత గ్రామం జన్నవరానికి చేరుకున్న వ్యక్తికి విశాఖ ఎయిర్‌పోర్టులో జరిపిన వైద్య పరీక్షలలో కరోనా పాజిటివ్ రిపోర్టు రావడం, ఈ సమాచారం అందుకున్న గవరవరం పీహెచ్‌సీ సిబ్బంది కరోనా సోకిన వ్యక్తి భార్య, అత్తమామలు, తల్లిదండ్రులు, కుమార్తెలకు ర్యాపిడ్ టెస్టులు చేయడం తెలిసిందే. దీంట్లో అతని భార్యకు కరోనా పాజిటివ్‌గా చూపడంతో భార్యాభర్తలిద్దరినీ జన్నవరం గ్రామానికి శివారులో ఉన్న వారి స్వంత ఇంటిలోనే హోం ఐసోలేషన్‌లో ఉంచారు. వీరికి ఐసోలేషన్ కిట్ అందచేసి నిరంతర వైద్య చికిత్సను అందచేశారు. ఈ కుటుంబ సభ్యులు ఆరుగురి నుంచి సేకరించిన శాంపిళ్లను విశాఖకు వైరల్ ట్రాన్స్‌పోర్టు మీడియం (వి.టి.ఎం) పరీక్షకు పంపించామని అక్కడ భార్యకు కరోనా లేదని నెగటివ్ రిపోర్టు వచ్చిందని డాక్టర్ దమయంతీదేవి తెలిపారు.

ప్రస్తుతం సింగపూర్ నుంచిన వ్యక్తి మాత్రమే కరోనాతో చికిత్స పొందుతున్నాడని, అతడు రెండు మూడు రోజులలో పూర్తి స్వస్థత పొంది ఐసోలేషన్ నుంచి బయటికి వస్తాడని ఆమె చెప్పారు. జన్నవరం వాసులే గాకుండా మండలంలో ప్రజలు కరోనాకు సంబంధించి ఎలాంటి అపోహలకు లోను గాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించి, నిశ్చింతగా ఉండాలని డాక్టర్ సూచించారు.

అమృతధారలా అభిమానం

గూడెంకొత్తవీధి: మండలంలోని దుచ్చరపాలెంలో ప్రేమామృత ధార కురిసింది. సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఆదివారం ట్రస్టు ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఎంతో అట్టహాసంతో నిర్వహించారు. ముందుగానే బిందెలతో స్వాగత తోరణాలు, చీరలతో స్వాగత మార్గాలు ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యసాయి ట్రస్టు ప్రతినిధి సాయికృష్ణకు సంప్రదాయ థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. పూల దండలతో వారిని ముంచెత్తి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం గ్రామంలో పలు చోట్ల నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాపులను ప్రారంభించారు. ఏజెన్సీ 11 మండలాల్లోనూ సత్యసాయి సేవా ట్రస్టు ద్వారా ఇప్పటివరకూ సుమారు 550 పథకాలను నిర్మించామన్నారు. అనంతరం సత్యసాయి సేవా ట్రస్టు భజన మండళ్ల ఆధ్వర్యంలో ప్రత్యేక భజన, ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం జరిగింది.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధల నడుమ నృసింహ స్వామి గంధం అరగదీత



గంధాన్ని అరగదీస్తున్న మహిళా భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం దిబ్బవీధి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి గంధం అరగదీత భక్తిశ్రద్ధల మధ్య సాగింది. ఈ కార్యక్రమానికి మహిళా భక్తులు అధికసంఖ్యలో హాజరై గంధాన్ని సిద్ధం చేసినట్టు ఆలయ వ్యవస్థాపకుడు మళ్ల రామచంద్ర రావు చెప్పారు. ఈ గంధాన్ని స్వామివారికి సోమవారం పూయనున్నామన్నారు.

'సన్'డే భగభగ



కశింకోటలో ప్రధాన పంచాయతీ రహదారి వెలవెల

కశింకోట : కశింకోట ప్రాంతంలో ఆదివారం సూర్య తాపంతో ప్రజలు విలవిలలాడారు. స్వల్పంగా వడ గాల్పులు కూడా వీయడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఎక్కువ శాతం మంది ఇళ్లకే పరిమితం కావడంతో వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం వాతావరణం చల్లబడడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

20 నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ

అనకాపల్లిటౌన్ : స్థానిక పూర్ణమి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు ఇవ్వనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నారాయణరావు ఆదివారం పేర్కొన్నారు. ఉచిత శిక్షణ నిష్ణాతులైన అధ్యాపకులిస్తారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.

వంటింట్లో అగ్ని ప్రమాదాల నివారణపై అప్రమత్తత



గ్యాస్ సిలిండర్ మంటలు వ్యాపిస్తే ఎలా ఆర్పాలో చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్ : అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పూసర్ల గీతాంజలి, శ్రీనివాస అపార్ట్‌మెంట్ల వాసులను ఆదివారం ఆశాఖ సిబ్బంది చేసిన మాక్ డ్రిల్ అబ్బురపరిచింది. వంటింట్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు అపార్ట్‌మెంట్ పై అంతస్తులో గ్యాస్ సిలిండర్ లీకైతే ఎలా రక్షించాలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి నరసింగరావు, సిబ్బంది, అపార్టుమెంట్ల వాసులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
మీటర్	సత్యనారాయణ స్క్రీన్-1
దంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
శాకుంతలం (3డి)	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-34 యూనిట్లు, ఓ పాజిటివ్ 44 యూనిట్లు, ఏబి పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 217 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 111 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

లక్ష్యానికి చేరువగా ఇళ్ల నిర్మాణాలు

- జగనన్న కాలనీల్లో చక చకా వెలుస్తున్న ఇళ్లు
- లబ్ధిదారుల ఆనందం
- గృహ నిర్మాణంలో జిల్లాలో మూడో స్థానం



వడ్డి వీధిలో వైఎస్సార్ జగనన్న లేఅవుట్



కశింకోటలోని వడ్డివీధి వైఎస్సార్ జగనన్న పెద్ద లే అవుట్‌లో తుది దశకు చేరుకున్న గృహ నిర్మాణాలు

కశింకోట : మండలంలో వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ లే-అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి కావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 43 శాతం మేర ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. ఈ ఏడాది ఉగాదికి ఇచ్చిన లక్ష్యాన్ని కూడా దాదాపు చేరుకున్నారు. మండలంలో వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణం కింద 2175 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 1690 ఇళ్లు జగనన్న లే-అవుట్లలో పంపిణీ చేసిన స్థలాల స్థానంలో ఇవ్వగా, మిగిలిన 487 ఇళ్లు సొంత స్థలాలు ఉన్న వారికి ఇచ్చారు. వీటిలో ఇప్పటికి 687 ఇళ్లు ఇప్పటికి పూర్తి అయినట్లు అధికారిక సమాచారం. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. గత ఉగాదికి 692 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించగా మండల అధికారులు,సిబ్బంది ఉమ్మడి సమిష్టి కృషితో 687 ఇళ్లు పూర్తి చేసి లక్ష్యానికి చేరువయ్యారు. తాజాగా ఈ నెలఖరుకుకు 37 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో ఎప్పటికప్పుడు మండల అధికారులు పర్యవేక్షిస్తూ లబ్దిదారులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి కూడా అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం లేఅవుట్లను శుక్రవారం సందర్శించి లబ్దిదారులతో మమేకమై ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని కోరారు. పునాదులు కట్టని వారు వాటిని సత్వరమే నిర్మించుకోవాలని సూచించారు. దీంతో లబ్దిదారులు గృహ నిర్మాణాల్లో నిమగ్నమయ్యారు.

కశింకోటలో వేగంగా ఇళ్ల నిర్మాణం:

కశింకోటలోని వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ లే-అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. కొందరు ఇప్పటికే ఇళ్లలో ప్రవేశాలు చేసి నివాసాలుంటున్నారు. మిగిలిన వారు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. వివిధ దశల్లో ఉన్నాయి. కశింకోటలో అత్యధికంగా 500 పైబడిన ఇళ్ల నిర్మాణం చేపట్టారు.5 చోట్ల లేఅవుట్లు ఏర్పాటు చేశారు. వీటిలో వడ్డి వీధిలో ఏర్పాటు చేసిన లేఅవుట్ అతి పెద్దది. ఇక్కడ ప్రభుత్వ భూమి లేకపోతే రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి 315 మందికి స్థలాలు, ఇళ్లు ఇచ్చారు. వీటిలో 133 మంది ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన ఇళ్లను లబ్దిదారులు నిర్మించుకునే పనిలో నిమగ్నమయ్యారు. కోట దిబ్బ, గాడి వీధి ప్రాంతాల్లో ఒక్కొక్కటి, సత్తెమ్మ కాలనీలో రెండు వంతున లే అవుట్లలో కూడా 201 మందికి ఇళ్లు, స్థలాలు ఇచ్చారు. వీటిలో కూడా ఎక్కువగా 85 ఇళ్లు పూర్తి అయ్యాయి. కొందరు గృహ ప్రవేశాలు కూడా చేశారు. మిగిలిన ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇక మండలంలోని మరో పెద్ద లేఅవుట్ తేగాడ వద్ద ఐదు గ్రామాలకు కలిపి 177 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 82 ఇళ్లు పూర్తి చేశారు.

ఈ లే అవుట్లలో విద్యుత్ సదుపాయం కల్పించారు. కొన్ని గృహాల లబ్దిదారులు విద్యుత్ కనెక్షన్లు పొంది ఇళ్లలో ఆనందంగా నివాసం ఉంటున్నారు. అయితే రహదారులు, నీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. ఇందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.పది లక్షల వరకు ఖర్చు అవుతుందని లబ్దిదారులు అంటున్నారు. ఆర్థిక స్తోమత ఉన్న కొందరు రెండు అంతస్తుల ఇళ్లు నిర్మించుకున్నారు. సొంతింటి కల సాకారం అయినందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది



ఉమ్మడిగా చిన్న ఇంట్లో ఉండే వాళ్లం. స్థలం, ఇల్లు మంజూరు చేయడంతో ఇల్లు నిర్మించుకున్నాం. త్వరలోనే గృహ ప్రవేశం చేస్తాం. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో స్థలం, ఇల్లు మంజూరు చేయడంతో సొంతింటి కల నెరవేరినందుకు ఆనందంగా ఉంది.

–తిరంగుల గంగ, లబ్దిదారురాలు, వడ్డి వీధి లేఅవుట్, కశింకోట

సొంతింటి కల నెరవేరింది



కశింకోటలో సొంత ఇల్లు లేక అద్దెకు ఉండేవాళ్లం. ఇప్పుడు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల స్థలం ఇవ్వడంతో సొంత ఇల్లు నిర్మించుకున్నాం. ఇక అద్దె చెల్లించే శ్రమ లేకుండా సొంతింటి కల నెరవేరడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

–పల్లెల ఈశ్వరరావు, వడ్డివీధి లేఅవుట్, కశింకోట

ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తి చేస్తాం



మండలంలో వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ పథకంలో 2175 ఇళ్లు మంజూరు కాగా, 687 పూర్తి అయ్యాయి.ఈ ఏడాది ఉగాదికి ఇచ్చిన లక్ష్యం దాదాపు పూర్తి చేశాం. ఈ నెలాఖరుకు మరో 37 ఇళ్లు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు లేఅవుట్లలో మండల అధికారుల బృందంతో పర్యటించి లబ్దిదారులను ప్రోత్సహించి లక్ష్యం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం గృహ నిర్మాణంలో మండలం జిల్లాలో మూడో స్థానంలో ఉంది.

–వెలగా శ్రీనివాసరావు, ఏఈ, గృహ నిర్మాణ శాఖ, కశింకోట

దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు



అన్నపూర్ణమ్మ ఆలయం చలివేంద్రంలో మజ్జిగ సేవిస్తున్న పాదచారులు



బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ప్రజలు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం సంతబయల అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద డైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఆదివారం ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆదేశాల మేరకు ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ చెప్పారు. బెస్ట్‌ఫ్రెండ్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నూకాంబిక ఆలయం వద్ద చలివేంద్రం క్లబ్ సభ్యులు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులు ఈ చలివేంద్రం దోహదపడుతుందని సభ్యులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ బొడ్డేడ ఆదినారాయణ, అధ్యక్షుడు బుద్ధ రమణాజీ, కార్యదర్శి భీమరశెట్టి మహాలక్ష్మినాయుడు, కోశాధికారి విల్లూరి కాశీ, సభ్యులు పాల్గొన్నారు. గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ నూకాంబిక ఆలయానికొచ్చిన భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ ఈవో బండారు ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. గవరపాలెం దిబ్బవీధి సీతారామా దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దేవస్థానం గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు ప్రారంభించారు.



నూకాంబిక ఆలయం వద్ద గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ సేవిస్తున్న భక్తులు



సీతారామ దేవస్థానం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాండ్రేగుల అప్పారావు, కమిటీ సభ్యులు

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



తుమ్మపాల: జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాకలో పైడితల్లమ్మ మొదటి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. కుంకుమపూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న భగవద్గీత శ్లోకాలు



ఎంపీ సత్యవతి దంపతులను సత్కరిస్తున్న సదస్సు సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టు హాలులో ఆదివారం రాత్రి జరిగిన పద్య కవితా సదస్సు జరిగింది. సదస్సులో పలువురు భగవద్గీత శ్లోకాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ సత్యవతి దంపతులు సదస్సు సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర పద్యకవితా సదస్సు జిల్లా అధ్యక్షుడు ఎం. వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కె.కోటారావు తదితరులు పాల్గొన్నారు.

జైభారత్ రాష్ట్ర కమిటీకి ఎంపిక

ఎస్.రాయవరం : జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కిందని మండలంలో కొరుప్రోలు గ్రామానికి చెందిన బి.వి.వి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన జై భారత్ జాతీయ కార్యదర్శి, విజయవిహారం సంపాదకులు రమణమూర్తి ఈ కమిటీని ప్రతిపాదించగా, కమిటీ ప్రతిపాదన మేరకు తాను సభ్యునిగా ఎంపికైనట్టు చెప్పారు. ఈమేరకు బీసీ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేలల యాజమాన్యం పాటించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): రైతులు పంటలు సాగు చేసే విషయంలో నేలల యాజమాన్యం పాటించాలని, రసాయన ఎరువులతో పాటు పచ్చిరొట్ట పంటలు, వర్మీ కంపోస్టును ఉపయోగించాలని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సూచించారు. ఆదివారం హరిపాలెం గ్రామంలో స్థానిక ఎరువులతో వ్యవసాయ విద్యార్థులు నేలల యాజమాన్యంపై సమూహ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల వాడకంపై పలు సూచనలు ఇచ్చారు.

మండుటెండతో అవస్థలు

రాంబిల్లి: ఎండల తీవ్రత పెరగడంతో మండలవాసులు ఆదివారం ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది.

ఎండదెబ్బకు రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ సూచించారు.

శరవేగంగా పూడిమడక రహదారికి మరమ్మతులు

మునగపాక : ఎట్టకేలకు పూడిమడక రోడ్డుకు మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అనకాపల్లి బైపాస్ జంక్షన్ నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారి దెబ్బతినడంతో నిత్యం రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడేవారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే యూవీ రమణ మూర్తిరాజు మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకురావడంతో అధికారులు స్పందించారు. ప్రస్తుతం రహదారి మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి.



చురుగ్గా పూడిమడక రోడ్డుకు మరమ్మతు పనులు

అచ్యుతాపురం నుంచి అనకాపల్లి జాతీయ రహదారి వైపునకు పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం తిమ్మరాజుపేట జంక్షన్ వద్ద మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి మరమ్మతులకు ముందుకు రావడంతో పలువురు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఎముకల దృఢత్వానికి పోషకాహారం అవసరం

మునగపాక : నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. అనకాపల్లి పద్మావతి ఆర్థోపెడిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరానికి డాక్టర్ ఆళ్ల వసంత్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వసంతకుమార్ మాట్లాడుతూ ఎముకలు దృఢంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. శిబిరాన్ని హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణ ప్రారంభించారు. శిబిరానికి 124 మంది రోగులు హాజరుకాగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

రబీ వరి కోతల్లో రైతులు బిజీ

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో రబీ వరి కోత పనులు జరుగుతున్నాయి. రజాల అగ్రహారం, మర్రిపాలెం, దిమిలి, రజాల, కుమ్మరాపల్లి తదితర గ్రామాల్లో సుమారు 2700 ఎకరాల్లో ఈ ఏడాది రైతులు రబీ సీజన్‌కు సంబందించి వరి పంటను సాగు చేసారు. శారద నదిలో పుష్కలంగా సాగునీరు ప్రవహించడంతో సాగునీటి ఇబ్బందులు తప్పాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులు తగ్గినట్లు పలువురు రైతులు తెలిపారు.

బయ్యవరంలో 'జగనన్నే మా భవిష్యత్తు'



బయ్యవరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సంక్షేమ పథకాల కర పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ఈ మేరకు రూపొందించిన కర పత్రాలను పంపిణీ చేశారు. జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు. బ్యాడ్జిలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనా తీరుపై రూపొందించిన ప్రశ్నావళి మేరకు సర్వే చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లవిల్లి నానాజీ, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ పాల్గొన్నారు.

క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదం



కశింకోటలోని అగ్రహారం వద్ద సరుగుడు మైదానంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ ఆదినారాయణరెడ్డి

కశింకోట: క్రీడలు శారీరక దారుఢ్యం పెంపొందించడానికి, మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అన్నారు. స్థానిక అగ్రహారం వద్ద సరుగుడు మైదానంలో కశింకోట యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల పట్ల కూడా దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో నైపుణ్యం సాధించి రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. పోటీల్లో 14 జట్లు ఉత్సాహంగా వచ్చి పాల్గొన్నాయి. నాకవుట్ విధానంలో పోటీలు నిర్వహించారు. ఫైనల్‌కు చేరిన కశింకోట-ఎ, కశింకోట-బి జట్ల మధ్య రసవత్తరంగా చివరి వరకు మ్యాచ్ జరిగింది. నిర్ణీత 12 ఓవర్లకు చివరికి 72 పరుగులతో మ్యాచ్ డ్రా అయింది. దీంతో సూపర్ ఓవర్ నిర్వహించడంతో ఒక పరుగు తేడాతో ఎ జట్టు విజేతగా నిలిచింది. బి జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.10 వేలు నగదు, షీల్డు, రన్నర్స్ జట్టుకు రూ.5 వేల నగదు నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు వెలుగుల చైతన్య, పల్లా శ్రీను, బి.సాయికుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా గురుకుల ప్రవేశపరీక్ష



పరీక్షకు పాఠశాలలోకి వెళ్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్: స్థానిక మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం ఐదో తరగతి ప్రవేశ పరీక్ష పకడ్బందీగా జరిగింది. విశాఖ ఉమ్మడి జిల్లా నర్సీపట్నం, చోడవరం, తాణాం, సింహాచలం, పెద్దనరవ, అమృతపురం నుంచి పరీక్షకు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003–04 బ్యాచ్‌కు చెందిన టెన్త్ పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలిశారు. పరస్పరం పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని తన్మయం చెందారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. తమ జ్ఞాపకాలకు గుర్తుగా ఉమ్మడిగా ఫోటో దిగారు.

అప్రోచ్ రోడ్డు ఏర్పాటుతో రాకపోకలకు అవకాశం



తోటాడ త్రిమూర్తుల ఆలయం వద్ద అప్రోచ్‌రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీటీసీ వెంకటలక్ష్మి, ఇస్మాయిల్

మునగపాక : తోటాడ త్రిమూర్తుల ఆలయం ఎదురుగా ఉన్న రహదారికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. సంబంధిత పనులను ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్ సంయుక్తంగా పరిశీలించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి రూ.6 లక్షల మేర నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ అప్రోచ్ రోడ్డు పూర్తయితే 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మళ్ల మహాలక్ష్మినాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, బుద్ధ రవి, దొడ్డి శ్రీధర్, కాండ్రేగుల శేషు, పొలమరశెట్టి నరేంద్ర, గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత గంగిరెడ్ల మృతికి సంతాపం



పాయకరావుపేట : మండలంలో గల శ్రీరాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గంగిరెడ్ల వెంకటరమణ ఆదివారం ఉదయం స్వగృహంలో అకాల మరణం పొందారు. గంగిరెడ్ల వెంకటరమణ (72) గ్రామ సర్పంచ్‌గా, పీఏసీఎస్ డైరెక్టర్‌గా గతంలో పదవులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి ఎంతో సేవలు అందించారు. ప్రస్తుతం వెంకటరమణ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా, శ్రీరాంపురం పీఏసీఎస్ డైరెక్టర్‌గా పదవుల్లో కొనసాగుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటరమణ కాలికి గాయం కావడంతో వారం రోజుల క్రితం విశాఖపట్నం వెళ్లి గాయానికి చికిత్స పొంది, స్వగృహంలోనే విశ్రాంతి తీసుకుంటూ ఆదివారం మృతి చెందారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు శ్రీరాంపురం వెళ్లి వెంకటరమణ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు వెంకటరమణ స్వగృహానికి వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంవీఆర్ అధినేత వెంకటేశ్వరరావు

కోటవురట్ల : సేవ చేయడంలో అంతులేని సంతృప్తి ఉందని ఎంవీఆర్ చారిటీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు అన్నారు. రాజుపేటలో సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎంవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విశాఖకు చెందిన మెడికవర్ వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్యాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంవీఆర్ చారిటీస్ ద్వారా ఏడాది పొడవునా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాజుపేటలో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని, సుమారు 500 మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. రోగులకు ఇభోజన సదుపాయం కల్పించామని తెలిపారు.